సాక్షి
వికారాబాద్
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలి

దృఢసంకల్పంతో పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఎన్.శుభప్రద్ పటేల్ అన్నారు. 8లో▸



ప్రజాసమస్యలు పట్టని సర్కార్

ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టడంలేదని, బీఆర్ఎస్ నేతలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. 8లో▸



మహిళల రక్షణకే షీటీం

మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని షీటీం ఇన్‌చార్జ్ నర్సింహులు పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కొడంగల్ అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో సన్మానించారు. కొడంగల్ అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. అభివృద్ధి పనుల కోసం ఇసుక సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, బొంరాస్‌పేట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయా రంగాల్లో మహిళా అభ్యున్నతికి కృషి చేసిన వారికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు ఇవ్వనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో సాధించిన సాధికారత, పురోగతి, విజయాల ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 20లోగా ౖజటట్ర్ఠీఃజర్ఝ్ౖజీ .ఛౌఝ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేరుగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు నగరంలోని వెంగళ్‌రావునగర్‌లో ఉన్న మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

డీఎఫ్ఓగా ప్రశాంత్ బాజీరావు

అనంతగిరి: జిల్లా అటవీ శాఖ అధికారిగా ప్రశాంత్ బాజీరావు పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డిని నగరంలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, ములుగు జిల్లా ఏటూరు నాగారం అటవీశాఖ అధికారిగా ఉన్న బాజీరావు పాటిల్‌ను వికారాబాద్‌కు బదిలీ చేశారు.

కాళేశ్వరం పేరిట దోపిడీ

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రైల్వే బోర్డు మెంబర్ ఉమారాణి
- కందనెల్లిలో ప్రజాగోస- బీజేపీ భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఉమారాణి

పెద్దేముల్: కాళేశ్వరం పేరిట ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్ల రూపాయలు దోచుకున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రైల్వే బోర్డు మెంబర్ ఉమారాణి ఆరోపించారు. కందనెల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రానికి దక్కాల్సిన నీళ్లు, నియామకాలను పక్క రాష్ట్రాలకు తరలించి తెలంగాణ ఆశయాలను తుంగలో తొక్కిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం తదితర విషయాల్లో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కలకలం రేపిన డ్రగ్స్, లిక్కర్ కేసుల్లో బీఆర్ఎస్ నేతలే కీలకంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏడున్నర ఏళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేయకపోవడం సర్కారు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ భద్రేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, జిల్లా కార్యదర్శి సార శంకర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ శివరాజ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మండల కార్యదర్శులు హరీష్, శ్రీకాంత్, విక్రంరెడ్డి, భూమే నర్సింహ, మహేశ్, నవీన్, రమేష్, అనీల్, శ్రీనివాస్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు. కందనెల్లి గ్రామానికి చెందిన అవినాష్, నవీన్‌గౌడ్, బిచ్చప్ప, శ్రీనివాస్, గోపాల్, సురేష్, వేణు తదితరులు బీజేపీలో చేరారు. ఉమారాణి వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు.



సిరిమానోత్సవానికి హాజరైన భక్తజనం



పూజలందుకున్న ఎల్లమ్మతల్లి

సిడెపై సిరుల తల్లి

భక్తుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే తల్లి పోలేపల్లి ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి అమ్మవారిని సిడె తొట్టెలలో కూర్చోబెట్టి ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేశారు. జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు పల్లె జనం వేలాదిగా తరలివచ్చారు. కోనేటి స్నానాలు ఆచరించి, అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కల్లు శాక, పసుపుబండారి, కోడి పుంజులు, మేకపోతులను కానుకలుగా ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

– బొంరాస్‌పేట



సూర్యాస్తమయం వేళ ఆలయ పరిసరాలు



తన్మయత్వంలో తల్లికి మొక్కులు



తాండూరులో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొడుగుతున్న సిబ్బంది

‘కోడ్’ అతిక్రమించొద్దు

వికారాబాద్ అర్బన్: శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో.. ఎలక్షన్ కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని సూచించారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు అధికారులు ఎవరూ బహిరంగ సభల్లో పాల్గొనకూడదని, సమావేశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని తెలిపారు. ఈసీ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు.

సొంత ఇంటిలా చూసుకోవాలి..

కొత్తగా నిర్మించుకున్న కలెక్టర్ కార్యాలయాన్ని సొంత ఇంటిలా చూసుకోవాలని ఆఫీసును పరిశుభ్రంగా పెట్టుకోవాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ప్రతి విభాగానికి స్కావెంజర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు.

వారంలో వంద..

జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో నిర్వహిస్తున్న ధరణి, ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటలకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.ఒక్కో తహసీల్ కార్యాలయం నుంచి ప్రతీవారం వంద సమస్యలకు పరిష్కారం చూపేలా పనిచేయాలన్నారు. కోర్టు కేసులు ఉన్న వాటి జోలికి పోవద్దని సూచించారు.

పనుల్లో వేగం పెంచాలి.

జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వాహణకు అనంతగిరిలోని టీబీ ఆస్పత్రిలో తాత్కాలిక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. అక్కడ కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగవల్లి, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చల్లాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఎఫెక్ట్..

తాండూరు టౌన్: మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని స్వాతంత్ర్య సమరయోధులు, దివంగత నేతల విగ్రహాలకు ముసుగు తొడిగారు. పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు.

13న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడలోగల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13న (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంఎస్‌డీఈ, డీఈఅండ్‌టీ హైదరాబాద్ వారి ఉత్తర్వులను అనుసరించి వివిధ పరిశ్రమలతో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు హాజరు కావాలన్నారు.



రేస్‌ను తిలకిస్తున్న సందర్శకులు





జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి

ఇ రేస్..ఇక జోష్

ఫార్ములా-ఇ రేసింగ్‌కు నగరం సిద్ధం

- దేశంలోనే తొలిసారి జరుగుతున్న ఈవెంట్
- సర్క్యూట్ వద్ద సెలబ్రిటీల సందడి

హుస్సేన్ సాగర్ తీరం ఈ వారాంతం నగర అభిమానులకు కొత్త వినోదాన్ని అందించనుంది. ప్రతీ వారం అలా నెక్లెస్ రోడ్‌లో విహారానికి వచ్చేవారి కోసం కాకుండా క్రీడాభిమానుల కోసం ఈ రెండో శనివారం ప్రత్యేకంగా అంకితం కానుంది. దేశంలోనే తొలిసారి నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఫార్ములా–ఇ రేసింగ్‌లో ఎలక్ట్రిక్ కార్లు రయ్ అంటూ దూసుకుపోవడాన్ని ఆస్వాదించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. శుక్రవారం కార్లతో కాస్త సాధన చేసిన డ్రైవర్లు అసలు పోరులో సత్తా చాటనున్నారు. రేస్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చే సినిమా తారలు, ఇతర సెలబ్రిటీలతో ఐమ్యాక్స్ పరిసరాలన్నీ సందడితో నిండిపోనున్నాయి.



సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర అభిమానులకు వారం రోజుల పాటు ట్రాఫిక్ సమస్యలు ఇబ్బంది కలిగించవచ్చు గాక.. విపరీతమైన జామ్‌లతో వారంతా అసహనం ప్రదర్శించవచ్చు గాక.. కానీ ఒక వరల్డ్ ఈవెంట్ మన నగరంలో జరుగుతోందంటే సహజంగానే ఉండే ఆసక్తి ఆ వైపు లాక్కెళ్తుంది. ఇప్పుడు ఫార్ములా–ఇ కూడా అలాగే అందరినీ ఆకర్షిస్తోంది. గంటకు దాదాపు 320 కిలోమీటర్ల వేగంతో రయ్యిరయ్యిమంటూ దూసుకుపోతూ ఫుల్ మీల్స్ వినోదం అందించడం ఖాయం. ఎన్నో ఏళ్లుగా మోటార్ రేసింగ్‌లపై ఆసక్తి ఉన్నవారు టీవీల్లో ఫార్ములావన్ (ఎఫ్1) పోటీలను తిలకిస్తూనే ఉంటారు. అయితే ఎఫ్1 అంత రేంజ్‌లో కాకపోయినా ప్రపంచస్థాయి ఈవెంట్‌గా మాత్రం ఫార్ములా–ఇ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. దేశంలోనే ముంబై, ఢిల్లీలాంటి మెగా నగరాలను కాదని మన హైదరాబాద్‌లో ఇలాంటి పోటీ జరగడం, దానిని చూసే అవకాశం రావడం సగటు అభిమాని దృష్టిలో పెద్ద విశేషం.

ఏమిటీ ఫార్ములా–ఇ..

పేరులోనే ‘ఇ’ ఉంటూ ఎలక్ట్రిక్ అంటూ స్పష్టంగా చెప్పేయడంతోనే దీని ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది. పెట్రోల్‌తో నడిచే ఫార్ములావన్ కార్లతో పోలిస్తే కాలుష్యరహితంగా, కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు తీసుకొచ్చిన కొత్త తరం కార్లు ఇవి. 2014లోనే ఫార్ములా–ఇ మొదలైనా.. దాని స్థాయి పెరిగి ప్రచారంలోకి వచ్చేందుకు కొంత సమయం పట్టింది. ఈసారి మరింత కొత్తగా, హంగులతో జనరేటెక్నాలజీ కార్లు రేసింగ్‌లో పాల్గొనబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగంపై ప్రచారం కల్పించేందుకు కూడా ఈ ఈవెంట్ ద్వారా ప్రయత్నిస్తున్నారు.

సాగర్ వద్దే ఎందుకు..

అయిన ఒక టూరిజం కేంద్రానికి చేరువలో ‘స్ట్రీట్ సర్క్యూట్’ పేరుతో ట్రాక్‌ను అభివృద్ధి చేస్తారు. సరిగ్గా హైదరాబాద్‌లో కూడా అదే జరిగింది. ఫార్ములా వన్‌లలో ఉండే ప్రత్యేక ట్రాక్ కాకుండా రేస్ ముగిసిపోగానే స్ట్రీట్ సర్క్యూట్‌ను మళ్లీ మామూలుగా వాడుకోవచ్చు. ఎక్కువ మంది అభిమానులకు నగరం నడిబొడ్డున వినోదం అందించడమే ఈ రేస్‌ల లక్ష్యం.

సర్క్యూట్ ఎలా ఉంది..

మేర ట్రాక్ ఉంది. ఇందులో 18 మలుపులు రేస్‌ను ఆసక్తికరంగా మారుస్తాయి. బ్రేక్‌ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే బ్రేక్‌లు వాడటం వల్లే ఈ కార్లతో 40 శాతం వరకు ఎనర్జీ ఉత్పత్తి అవుతుంది. ఈ ‘రీ ఎనర్జీ’తోనే కారు మరింతగా దూసుకుపోతుంది.

భారతీయులు ఉన్నారా?

చెందిన డ్రైవర్లు ఎవరూ పాల్గొనడం లేదు. అయితే భారత్‌కు చెందిన ‘మహీంద్రా’ రేసింగ్ టీమ్ మాత్రం ఉంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లు విదేశీయులే కాగా, రిజర్వ్ డ్రైవర్‌గా భారత్‌కు చెందిన జెహాన్ దారువాలా ఉన్నాడు. మరో వైపు జాగ్వార్ టీమ్‌కు భారత్ చెందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. కాబట్టి అభిమానులు ఏదైనా జట్టును ‘సొంతం’ చేసుకుంటే ఈ వినోదాన్ని మరింతగా ఆస్వాదించవచ్చు.

- ఫార్ములా–ఇ పోటీలకు ఆతిథ్యమిస్తున్న 30వ నగరం హైదరాబాద్
- వరకు 8 సీజన్‌లు జరిగాయి. ప్రస్తుతం జరుగుతోంది 9వ సీజన్.

హైలైట్స్

- రోడ్లులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌ను సిద్ధం చేయడంతో పాటు పోటీల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.
- 20 వేల మందికి పైగా వీక్షించేందుకు అనువైన పెద్ద గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భారీ స్క్రీన్‌లను సిద్ధంచేశారు.
- నాటి పోటీలకు సన్నాహకంగా శుక్రవారం నిర్వహించిన ప్రాక్టీస్ రన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా తెలుగుతల్లి ఫ్లై ఓవర్, లక్డీకాపూల్ మార్గంలో వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో కొన్ని వాహనాలు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ట్రయల్స్ నిర్వహణకు ఆటంకం కలిగినట్లు తెలిసింది.
- మరోవైపు ట్రయల్స్ ఆరంభంతోనే రేసింగ్ డ్రైవర్‌లు హోరెత్తించారు. అపరిమితమైన వేగంతో వాహనాలను పరుగులు పెట్టించి సందర్శకులను హుషారెత్తించారు.

నేటి షెడ్యూల్

ఉ.గం.8.05 – 8.55 (ఫ్రీ ప్రాక్టీస్ రేస్–2) 10.40–11.55 (క్వాలిఫయింగ్) మ.3.03 – 4.30 (ప్రధాన రేస్) టీవీలో క్వాలిఫయింగ్, ప్రధాన రేస్ ప్రత్యక్ష ప్రసారం: స్టార్ స్పోర్ట్స్ సెలక్ట్–2, డిస్నీ హాట్‌స్టార్ యాప్

- ఈ పోటీలను ట్రయల్ రన్‌గా నిర్వహించినప్పటికీ వీక్షించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు.
- ట్రయల్ రన్స్ తుదిదశకు చేరుకున్న తరువాత ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్‌పై దూసుకెళ్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రయల్స్‌ను నిలిపివేశారు. క్రేన్ సాయంతో కారును అక్కడి నుంచి తరలించారు.

ప్రముఖుల సందడి

ట్రయల్ రన్స్‌ను వీక్షించేందుకు నగరానికి చెందిన మోటార్‌స్పోర్ట్స్ ప్రియులు పెద్ద సంఖ్యలోనే తరలి వచ్చారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వీవీఐపీ గ్యాలరీలు సందడిగా కనిపించాయి. ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతి, మహేశ్‌బాబు భార్య నమ్రత శిరోద్కర్, తెలుగు దేశం నాయకుడు లోకేష్ భార్య బ్రాహ్మణితో పాటు వారి పిల్లలు ఈ ట్రయల్ రన్ సందర్భంగా సందడి చేశారు.



మన జెండాతో విదేశీయులు





మహేశ్‌బాబు సతీమణి నమ్రత, కుమారుడు గౌతమ్

క్లుప్తంగా

శివాలయం అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



ఎమ్మెల్సీని కలిసిన మల్కాపూర్ నాయకులు, శివ మాలధారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఉన్న శివాలయం అభివృద్ధికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మల్కాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, శివ మాలధారులు పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో కలిసారు. శివాలయం వద్ద ఓ గదితో పాటు ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండల కో ఆప్షన్ శంషోద్దిన్, ఎంపీటీసీ రవిసింధే, గని కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ పండరి, నాయకులు మైనొద్దిన్, పండరి, వెంకటయ్య, మొగులాన, శివ మాలధారులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



ఈటలతో ముదిరాజ్ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరణకు రావాలని ఆహ్వానం పలికారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాలేకపోతున్నానని, సమావేశాలు ముగిశాక కొడంగల్ పర్యటనకు రానున్నట్లు ఈటల తెలిపినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు చిల్ముల రాజు, పిరంగి శ్రీనివాస్, బయిండ్ల వెంకటేశ్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను యాలాల పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. మండల పరిధిలోని దేవనూరు శివారు నుంచి ఓ ట్రాక్టరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించగా..ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టరును గుర్తించారు. పట్టుబడ్డ ట్రాక్టరు బొంరాస్‌పేట మండలం దువ్వచర్ల గ్రామానికి చెందిందని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం



జయనందం మృతదేహం

నవాబుపేట: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మీనపల్లికలాన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మీనపల్లికలాన్ గ్రామానికి చెందిన జయనందం(55) తనకున్న ఎకరంన్నర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య స్వరూపతో పాటు కూతుళ్ల అక్షిత(12), అంకిత(8) ఉన్నారు. అయితే ఇదివరకే ఆయనకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహమైంది. కూతురు పుట్టగానే కుటుంబకలహాలతో విడిపోయి వేరే గ్రామంలో ఉంటోంది. ఆ తరువాత స్వరూపను పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల మొదటి భార్య వచ్చి భూమిలో వాటా ఇవ్వాలని పట్టుబడుతోంది. ఈక్రమంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం రోజుమాదిరిగానే పొలానికి వెళ్లాడు. 8 గంటల ప్రాంతంలో భార్య పొలానికి వెళ్లగా జయనందం చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ మార్చురిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌భూషన్ తెలిపారు.

సందడిగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

- జూనియర్ విభాగంలో విజేతగా గౌతమ్ జూనియర్ కాలేజ్
- సీనియర్స్ విభాగంలో విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్
- 17 రీజినల్ ఫైనల్స్

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI — SAKSHI DIGITAL MEDIA GROUP



భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు

పోచారం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో కొనసాగుతున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు శుక్రవారం సెమీ ఫైనల్స్‌తో పాటు ఫైనల్స్ సందడిగా సాగాయి.

విజేతల వివరాలు..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- జూనియర్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 87 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భవన్స్ శ్రీఅరవిందో జూనియర్ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 79 రన్స్ తీసి ఓటమి పాలైంది. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల స్థాయి జూనియర్ విభాగంలో గౌతమ్ జూనియర్ కాలేజ్ జట్టు విజేతగా నిలిచింది.
- సీనియర్ విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎమ్‌ఎల్‌ఆర్‌ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 82 రన్స్ మాత్రమే చేయడంతో వేద డిగ్రీ కాలేజ్ విజయం సాధించింది.



గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 2

- సీనియర్స్ విభాగం రెండో సెమీ ఫైనల్స్‌లో ఎస్‌పీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 116 పరుగులు తీసింది. ఈ జట్టుతో తలపడిన భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్ల కోల్పోయి 117 పరుగులు తీసి విజయం చేజిక్కించుకుంది. ఈ సెమీ ఫైనల్స్‌లో భవన్స్ జట్టు నుంచి జగదీష్ 27 బంతుల్లో 66 పరుగులు చేశాడు. మరో క్రీడాకారుడు క్రిస్టిక్ 26 బంతుల్లో 49 రన్స్ చేశాడు.
- సీనియర్స్ విభాగం ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వేద డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 72 రన్స్ చేసింది. వీరితో బ్యాటింగ్ చేసిన భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టు 1 వికెట్ కోల్పోయి 73 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. భవన్స్ జట్టు సభ్యుడు నితీష్ 8 బాల్స్‌లో 27 రన్స్ తీసి ప్రతిభ చాటాడు. జగదీష్ 15 బంతుల్లో 22 రన్స్ సాధించాడు. సీనియర్ విభాగంలో హైదరాబాద్ జిల్లా విజేతగా భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల సైనిక్‌పురి నిలిచింది.
- ఈ నెల 17న ఇదే మైదానంలో రీజినల్ ఫైనల్స్ నిర్వహించనున్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలి

- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్
- అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న శుభప్రద్‌పటేల్, డీఆర్‌ఓ అశోక్ కుమార్

వికారాబాద్ అర్బన్: దృఢసంకల్పంతో పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తాండూరు డివిజన్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్–3, 4లకు శిక్షణ పొందిన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించాక నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అందులో భాగంగానే జోనల్ వ్యవస్థ తీసుకొచ్చి స్థానికులకే 95 శాతం ఉద్యోగాలు దక్కేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లక్షా 32వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న మరో 90 వేల ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చినట్లు తెలిపారు. గ్రూప్స్–3, 4లలో సుమారు 10,500 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల ముందు నుంచే నిరుద్యోగులకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగం సాధించాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు తాడూరు డివిజన్‌లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి సుమారు 95 మందికి శిక్షణ ఇప్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, డీబీసీ డబ్ల్యూ ఉపేందర్, బీసీ సట్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

డీఈ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతాం



మాట్లాడుతున్న ఉద్యోగ నాయకులు

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14న విద్యుత్ డీఈ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతామని విద్యుత్ హెచ్ 82 యూనియన్ నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్‌లోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు భోజన మధ్యాహ్న వేళ లంచ్‌అవర్‌లో ధర్నా చేపడతామన్నారు. వికారాబాద్, తాండూరు డీఈ కార్యాలయాల ఎదుట ఈ ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను జేఎల్‌ఎంగా గుర్తించాలన్నారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో ముఖ్య నాయకులు జైపాల్, జమీల్, నర్సింహులు, సుభాన్, అమిత్, వెంకటయ్య, నజీర్, గోపాల్, కృష్ణ, సతీష్, రాజ్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని సర్కార్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

ధారూరు: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సమస్యలు ఏ మాత్రం పట్టడంలేదని, అధికార పార్టీ నేతలు కూడా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాంపూర్‌తండా, రుద్రారం, గట్టెపల్లి గ్రామాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జి రమేశ్ అధ్వర్యంలో శక్తికేంద్ర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నిరంకుశ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. మాయమాటలు చెప్పి సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన కేసీఆర్ ప్రభుత్వాన్ని, చేస్తున్న మోసాలను ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, బీజేపీ నాయకులు నెల్లి విశ్వనాథం, రవీందర్‌గౌడ్, నరోత్తమ్‌రెడ్డి, బస్వలింగం అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హరీష్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘాటైన వాయువులతో ఉక్కిరిబిక్కిరవుతున్నాం

- జిప్సం ఫ్యాక్టరీని మూసివేయాల్సిందే
- కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఎదుట గుంతబాసుపల్లి వాసుల మొర



కాలుష్య నియంత్రణమండలి అధికారులతో మాట్లాడుతున్న గుంతబాసుపల్లి గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గుంతబాసుపల్లి శివారులో ఉన్న జిప్సం ఫ్యాక్టరీ నుంచి నిత్యం ఘాటైన విషవాయులు వెలువడుతున్నాయని, రాత్రివేళ నిద్రపట్టడంలేదని గ్రామస్తులు వాపోయారు. శుక్రవారం రంగారెడ్డి, వికారాబాద్ ఉమ్మడి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఏఈఓ సిద్దార్థ తన సిబ్బందితో గుంతబాసుపల్లికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. జిప్సం ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న బోరు మోటార్లలో కలుషితమైన నీటిని సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారుల ఎదుట తమ గోడును వెలిబుచ్చారు. రాత్రి అయితే చాలు ఫ్యాక్టరీ నుంచి దుర్వాసనతో కూడి ఘాటైన విషవాయులు వెలువడుతున్నాయని, ఫ్యాక్టరీ నుంచి విడుదల చేసే వ్యర్థ జలాలతో భూగర్భ జాలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. నీరు కలుషితం కావడంతో వ్యవసాయ బోర్ల నుంచి రంగుమారి దుర్వాసనతో కూడిన నీళ్లు వస్తున్నాయని చెప్పారు. గ్రామంలో తాగునీరు కూడా కలుషితం కావడంతో నీరు తాగలేకపోతున్నామన్నారు. ఈ నీటితో స్నానంచేసిన తరువాత శరీరంపై మచ్చలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెప్పారు. వెంటనే కెమికల్ ఫ్యాక్టరీని సీజ్ చేయాలని మహిళలు అధికారులతో మొరపెట్టుకున్నారు. ఫ్యాక్టరీని పరిశీలించి, బోర్ల నీటిని సేకరించి రిపోర్టును ఉన్నతాధి కారులకు పంపిస్తామని ఏఈఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాయితీ అధికారికి బదిలీ బహుమానమా?

- ఐదు నెలలకే డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్‌రెడ్డికి స్థానచలనం
- ప్రభుత్వ భూములను కాపాడటమే కారణమా?



బదిలీపై వెళ్లిన డీఎఫ్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి

వికారాబాద్: అధికారులు అవకాశవాదులుగా మారి.. ప్రజాప్రతినిధులు, బడా వ్యక్తుల అడుగులకు మడుగులొత్తుతున్న సమయంలో నిజాయితీగా ఉండటం సవాలే.. నిజాయితీగా వ్యవహరిస్తే అవార్డులు, రివార్డులు ఏమో గానీ బదిలీ.. లేక సస్పెన్షన్ వేటో తప్పదన్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం డీఎఫ్‌ఓ విషయంలో కూడా ఇదే రుజువయ్యింది. అయిన వచ్చీ రాగానే అక్రమార్కులకు సింహస్వప్నమయ్యారు. వారి గుండెల్లే రైళ్లు పరిగెత్తేలా చేశారు. కాని వచ్చిన అనతికాలంలోనే అనేక మార్పులకు నాంది పలికిన ఆయన అక్రమార్కులకు కొరకరాని కొయ్యగా మారారు. ఎవరు చెప్పినా... హెచ్చరించిన లెక్క చేయకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్లారు. అలాంటి జిల్లా ఫారెస్టు అధికారి జిల్లా డీఎఫ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌రెడ్డి ఐదు నెలల్లోనే బదిలీ కాకా తప్పలేదు.

సంస్కరణలకు శ్రీకారం

డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్‌రెడ్డి అనేక మార్పులకు, సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఏళ్లుగా ఆక్రమణలకు నోచుకున్న వాటిని బయటకు తీసి రుజువులతో సహా కోర్టు ముందుంచారు. వికారాబాద్, తాండూరు సమీపంలో కాంట్రాక్టర్లు ఫారెస్టు భూముల్లో తవ్వకాలు జరిపి రూ. వందల కోట్ల విలువగల ఖనిజ సంపద తరలిస్తున్నారని గుర్తించి అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ఫారెస్టు భూములు కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయించారు. వారు కోర్టులకు వెళ్తే కౌంటర్ ఫైల్ వేశారు. అనుమితి లేని సా మిల్లులపై ఉక్కుపాదం మోపారు. అక్రమ కలప రవాణాను అడ్డుకోవటం, అక్రమ కలప కొనుగోలు దారులకు రూ.లక్షల్లో ఫైన్లు వేయటం, అనుమతిలేకుండా ఫారెస్టు భూముల్లోంచి రోడ్లు వేసిన కాంట్రాక్టర్లకు ఫైన్లు వేయటం లాంటి అనేక విషయాల్లో ఆయన ఉక్కుపాదం మోపారు. ఇక వారి ఆటలు సాగవని భావించి కొందరు ప్రజా ప్రతినిధులపై వత్తిడి తెస్తూ వచ్చారు. ఎట్టకేలకు నిజాయితీగా వ్యవహరించిన అధికారిని సాగనంపారు.

నేటి నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

కుల్కచర్ల: జిల్లాస్థాయి ఓపెన్ టు ఆల్ బ్యాడ్మింటన్ పోటీలను శనివారం నుంచి రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కుమ్మరి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో బ్యాడ్మింటన్ టోర్నీ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 94904 24960, మురళి 94404 42408 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తాండూరుకు ఎంఎంటీఎస్ వచ్చేలా కృషి చేస్తా

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రైల్వే బోర్డు మెంబర్ ఉమారాణి

పెద్దేముల్: నగరం నుంచి లింగంపల్లి వరకు వస్తున్న ఎంఎంటీఎస్ రైలును తాండూరు వరకు వచ్చేలా కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, రైల్వేబోర్డు మెంబర్ ఉమారాణి అన్నారు. శుక్రవారం కందనెల్లి గ్రామంలో జరిగిన బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాండూరు, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రయాణికులు నిత్యం అధిక సంఖ్యలో నగరానికి రాకపోకలు సాగిస్తారన్నారు. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను స్వయంగా విన్నవించినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

నగలు తయారుచేస్తానని బంగారంతో పరార్

- ఇబ్రహీంపట్నంలో పట్టుకున్న బాధితులు
- పోలీసులకు అప్పగింత

యాచారం: నగలు తయారు చేస్తానని వెండి, బంగారంతో పరారైన ఓ వ్యాపారిని బాధితులే పోలీసులకు పట్టించారు. యాచారం సీఐ లింగయ్య తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామానికి చెందిన భూషణచారి యాచారం మండల పరిధి తక్కళ్లపల్లిలోని సిద్ధగోని యాదమ్మ ఇంట్లో నగల తయారీ దుకాణం నిర్వహిస్తున్నారు. ప్రారంభంలో గ్రామస్తులకు నగలు తయారు చేసి త్వరగా ఇవ్వడంతో ప్రజల్లో విశ్వాసం కలిగింది. దీంతో పలువురు మహిళలు అరతులం బంగారం, దాదాపు 150 తులాల వెండిని నగల తయారీ కోసం భూషణాచారికి ఇచ్చారు. బంగారం, వెండి తీసుకున్న భూషణాచారి వారం రోజులుగా దుకాణం తెరవడం లేదు. అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్కళ్లపల్లి గ్రామస్తులు గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నంకు వెళ్లారు. భూషణాచారి మోహనికి మాస్కు పెట్టుకుని తప్పించుకుని తిరగుతున్నాడు. పసిగట్టిన గ్రామస్తులు వెంటనే 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులకు భూషణాచారిని అదుపులోకి తీసుకుని యాచారం పోలీసులకు అప్పగించారు. విచారించిన పోలీసులు శుక్రవారం భూషణాచారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నకిలీ సర్టిఫికెట్ల దందా గుట్టు రట్టు

- భూదాన్ బోర్డు పేరుతో మోసం
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎస్‌ఓటీ పోలీసులు

ఇబ్రహీంపట్నం: భూదాన్ బోర్డు పేరుతో నకిలీ భూ సర్టిఫికెట్ల దందా చేస్తున్న ఇద్దరిని ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శేఖర్ కేసు వివరాలు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్నరావుల శ్రీశైలం(38)కు స్థానిక మంచాల రోడ్డులో మటన్ షాపు నడిపే రవితో రెండేళ్ల నుంచి పరిచయం ఉంది. ఆ పరిచయంతో రూ.లక్ష ఇస్తే భూదాన్ బోర్డు నుంచి 5 ఎకరాల భూమిని సైదాబాద్ కంచె సర్వేనంబర్ 58లో ఇప్పిస్తానని రవి భార్య లావణ్యకు నమ్మబలికాడు. భూ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో రూ.50 వేలు, పాసుబుక్ ఇచ్చేటప్పుడు మరో రూ.50 వేలు ఇవ్వాలని చెప్పాడు. అతని మాటలు నమ్మి లావణ్య తన ఆధార్‌కార్డు, రూ.50 వేల నగదు ఇచ్చింది. యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన ఎట్టి లింగమయ్య (31) ఇబ్రహీంపట్నంలో శ్రీకృష్ణ జిరాక్స్, ఇంటర్నెట్ షాపు నడుపుతున్నాడు. ఒక ఫోర్జరీ సర్టిఫికెట్‌కు రూ.5 వేలు ఇస్తానని లింగమయ్యతో శ్రీశైలం కుమ్మక్కయ్యాడు. సెప్టెంబర్ 2016లో 5 ఎకరాల భూదాన్ బోర్డు భూమి లావణ్యకు ఇచ్చినట్లుగా ఫోర్జరీ సర్టిఫికెట్ సృష్టించి ఇచ్చాడు. ఆదిబట్లకు చెందిన టింగ్లికార్ స్వప్న, కుర్మల్‌గూడకు చెందిన కొయల్‌కార్ అనిత, బడంగ్‌పేట్‌కు చెందిన బండ బాలమణి, మీర్‌పేట్‌కు చెందిన చంద్రశేఖర్‌ను సైతం శ్రీశైలం, లింగమయ్య కలిసి మోసం చేశారు. సర్టిఫికెట్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా పాసుబుక్స్ ఇవ్వలేదు. పలుమార్లు ఫోన్లు చేసినా స్పందన లేకపోవడంతో బాధితులకు అనుమానం కలిగి పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలోని శ్రీకృష్ణ ఇంటర్నెట్ షాప్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి నకిలీ సర్టిఫికెట్లు, కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీశైలం, లింగమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నంతోపాటు ఆదిబట్ల, మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్లలో నిందితులపై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా కల్యాణం

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాలు



స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పట్టణ కేంద్రంలోని భ్రమరాంబమల్లికార్జున స్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. పుణ్యాహవచనం, ధ్వజారోహనం, మహన్యాస రుద్రాభిషేకం, పల్లకీసేవ, గణపతి హోమం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

– పరిగి

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

శంకర్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. శంకర్‌పల్లి ఎస్ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొంతాన్‌పల్లి ఇక్ఫాయి కళాశాల పరిసరాలల్లో ముగ్గురు అనుమానితులు విద్యార్థులకు గంజాయి ప్యాకెట్‌లను విక్రయిస్తున్నారు. కళాశాల వద్ద వాహనాల తనిఖీలు నిర్వస్తుండగా వీరు పట్టుబడ్డారు. నిందితులు అల్లుకుంట్లు అయ్యప్ప, మహ్మద్ నవాజ్, రాపోల్ ఉదయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.